సాక్షి
పెద్దపల్లి
ఆదివారం । 19 । నవంబర్ । 2023



ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

మంథని: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వణకు ఏర్పాట్లు చేస్తున్నామని ఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు.



చిందు యక్షగానం

వేములవాడ: రాజన్న భక్తులకు అహ్లాదాన్ని పంచేందుకు వైకుంఠం బృందం ఆధ్వర్యంలో శనివరం మైరావతి చిందు యక్షగానం నిర్వహించారు. భక్తులు కాలక్షేపం చేశారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.0/27.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్/ఫెర్టిలైజర్‌సిటీ: ప్రతీవిద్యార్థికి చట్టాలపై అవగాహన అవసరమని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆఎఫ్‌సీఎల్‌లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చిన్న తనం నుంచి ర్యాగింగ్, మద్యపానం, మహిళలపై వేధింపుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. లోక్ అదాలత్ సభ్యులు మేడ చక్రపాణి, శంకర్, న్యాయవాదులు అరుణ్‌కుమార్, విక్రమ్, మధు, గుడికందుల భూమయ్య, జి.ప్రసన్న, భానుకృష్ణ, అనురాధ, హెచ్ఎం రవికాంత్, లీగల్ వలంటీర్ సుజాత పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని గోదాంను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివార పరిశీలించారు. ఈనెల 30న పోలింగ్ నిర్వహిస్తారు. ఆ ప్రక్రియ పూర్తయ్యాక జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల ఈవీఎంలను భద్రపర్చేందుకు వీలుగా ఇక్కడి మార్కెట్‌యార్డును సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కిచెన్ గార్డెన్‌తో ఆరోగ్యం



కిచెన్ గార్డెన్ పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

ఫెర్టిలైజర్‌సిటీ: కిచెన్ గార్డెన్‌తో ఆరోగ్యంగా ఉంటారని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ- ఎల్కలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం కిచెన్ గార్డెన్‌పై విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులతో అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయల మొక్కలు పెంచడంతో మంచి పరిణామమన్నారు. హెచ్ఎం విమల, ఉపాధ్యాయులు శ్రీనివాస్, విజయలక్ష్మి, ఎండీ జలీల్ పాషా, ఉమారాణి, భవాని, శోభారాణి, రికార్డు అసిస్టెంట్ రాయమల్లు, పోషకులు పాల్గొన్నారు.

అందరూ ఓటు వేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జ్యోతినగర్(రామగుండం): అర్హత ఉన్న ప్రతిఒక్కరూ తమఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా, రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ అన్నారు. ఎన్టీపీసీ ఉద్యోగ వికాస కేంద్రం ఆడిటోరియంలో పీజీ, డిగ్రీ విద్యార్థులతో శనివారం ఓటు ప్రాముఖ్యత, ఓటుహక్కు వినియోగం, తొలిసారి ఓటుహక్కు పొందిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటు ప్రాముఖ్యతపై కళాజాతతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, ఏఆర్‌వోలు కుమ్మర స్వామి, జ్యోతి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రవుఫ్ ఖాన్, రామగుండం అధికారి స్వరూపరాణి, మీడియా నోడల్ అధికారి రజని పాల్గొన్నారు.

విద్యార్థుల 'ఉన్నతి'కి కృషి




ఎలిగేడులో మాట్లాడుతున్న ఉషారాణి

ఎలిగేడు/సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లోని చదువులో వెనుకబడిన ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులను గుర్తించి ఉన్నతి పథకం ద్వారా అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఉన్నతి రాష్ట్ర పరిశీలకులురాలు ఉషారాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన ఎలిగేడు, సుల్తానాబాద్, జూలపల్లి, ధర్మారం జీవశాస్త్రం ఉన్నతి స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరై మాట్లాడారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ప్రణాళికద్వారా ఉన్నతిని ముందుకు తీసుకు వెళ్లాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం షేక్, మండల నోడల్ ఆఫీసర్ నరేంద్రచారి, జి.దేవేందర్ రావు, సీఆర్పీ లక్ష్మీనారాయణ, యూసుఫ్, శ్వేత, డీఆర్పీ సాధన తదితరులు పాల్గొన్నారు.

నిద్రపోని నాయకులు!

నాయకా.. ఆరోగ్యం జాగ్రత్త



- రోజుకు 4 గంటలు కూడా నిద్రపోని లీడర్లు
- అజీర్తి, లోబీపీతో బాధపడుతున్న వైనం
- డీజేల హోరుతో ఇబ్బందులు తప్పవంటున్న డాక్టర్లు
- షుగర్, హృద్రోగులు అప్రమత్తంగా ఉండాలని సూచన
- పలుచోట్ల గాయపడుతున్న నాయకులు, కార్యకర్తలు

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ ప్రచారంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. డీ హైడ్రేషన్ కారణంగా ఆమె అస్వస్థతకు గురయ్యారు. సరైన విశ్రాంతి లేకపోవడం వల్లే ఇలా జరిగింది.

ఇటీవల పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుడి ప్రచార ర్యాలీ జరిగింది. ఇందులో ఉత్సాహంగా పాల్గొన్న ఓ నాయకుడు ఉన్నట్టుండి గుండెపోటుతో కుప్పకూలాడు. వెంటనే అతన్ని కరీంనగర్ తరలించడంతో ప్రాణాపాయం తప్పింది.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరిగింది. ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్దీ.. నాయకులు విశ్రాంతి లేకుండా శ్రమిస్తున్నారు. దాదాపు అన్ని పార్టీల అభ్యర్థులు ఉదయం 5 గంటలకే నిద్రలేస్తున్నారు. కొందరు రాత్రి 12 గంటల నుంచి ఒంటిగంట వరక మేలుకొనే ఉంటున్నారు. సీనియర్ నాయకులు, మంత్రులకు తమ నియోజకవర్గంతోపాటు అదనపు నియోజకవర్గాల బాధ్యతలు, స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న వారికి ఇతర నియోజకవర్గాల ప్రచార డ్యూటీలు కూడా ఉండటంతో నిద్రకు దూరమవుతున్నారు. ఫలితంగా పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. కరీంనగర్‌లో మంత్రి గంగుల కమలాకర్ ఇటీవల తాను పాల్గొన్న ఓ సభలో వాంతి చేసుకున్నారు. సరైన నిద్ర, విశ్రాంతి లేకపోవడం వల్లే ఇలా అయిందని ఆయన అనుచరులు పేర్కొన్నారు. బీజేపీ స్టార్ క్యాంపెయినర్‌గా ఉన్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రతీరోజు రాష్ట్రంలో ఏదో ఒకచోట ప్రచారం చేయాల్సి వస్తోంది. ఆయన కూడా ఇటీవల నిద్రలేక లోబీపీకి గురయ్యారు. వీరే కాదు.. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులందరికీ ఆరోగ్యపరంగా పలు సమస్యలు చుట్టుముట్టే అవకాశాలున్నాయి.

ఎవరికి ఎంత నిద్ర అవసరం?

అప్పుడే పుట్టిన బిడ్డలు రోజుకు 15 గంటలు. ఒకటి నుంచి 3 ఏళ్లలోపు 12-15 గంటలు, 3-5 ఏళ్లవారు 11-15 గంటలు, 5-12 ఏళ్లవారు 9-11 గంటలు, 13-17 ఏళ్లవారు 8-10 గంటలు, 18-25 ఏళ్లవారు 7-9 గంటలు, 26-64 ఏళ్ల వరకు 7-9 గంటల పాటు నిద్రపోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం	బరిలో
కరీంనగర్:	27
హుజూరాబాద్:	22
చొప్పదండి:	14
మానకొండూరు:	10
సిరిసిల్ల:	21
వేములవాడ:	16
పెద్దపల్లి	17
మంథని	21
రామగుండం	23
జగిత్యాల	15
కోరుట్ల	15
ధర్మపురి	15
మొత్తం	216

లేకపోతే ఏమవుతుంది?

ప్రస్తుతం పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల నాయకులందరూ రోజుకు 4 గంటలకు మించి నిద్రపోవడం లేదు. అర్ధరాత్రి వరకు మెలకువతో ఉండటం, తెల్లవారుజామున లేవడం వల్ల వారికి నిద్ర సరిపోవడం లేదు. ఫలితంగా బరువు పెరగటం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, బీపీ, గుండెజబ్బులు, మతిమరుపు వంటి సమస్యలు వచ్చి, చివరకు తీవ్ర అనారోగ్యానికి దారితీసే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. సమయానికి భోజనం చేయకపోవడంతో షుగర్ బారిన పడుతున్నారని అంటున్నారు. కొందరు డీజేలతో ప్రచారం చేస్తున్నారు. దాని పక్కన డాన్సులు చేసే నాయకులు, కార్యకర్తలకు గుండెపోటు ముప్పు పొంచి ఉందని పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో కిందపడి, గాయాల పాలవుతున్నారు.

నిద్రలేమితో అనేక సమస్యలు



ప్రతీ మనిషికి 6 నుంచి 8 గంటల నిద్ర అవసరం. నిద్రలేమి అనేక సమస్యలకు కారణమవుతుంది. ముఖ్యంగా ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి తగ్గడం, తలనొప్పి, నీరసం వంటివి వస్తాయి. ఎక్కువ రోజులు నిద్రలేమి ఉంటే బీపీ, షుగర్, గుండె జబ్బుల బారిన పడతారు. బరువు పెరగడం, బ్యాలెన్స్ తప్పడం, ఇమ్యూనిటీ కోల్పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

– డాక్టర్ సాయిని నరేందర్, ఎండీ

ఏ గుర్తు... ఎంతిస్తరు?

- పార్టీల ప్రచారానికి 'పెయిడ్' కార్యకర్తలు
- మీటింగ్ ఏ పార్టీదైనా కార్యకర్తలు వాళ్లే..
- రాజకీయ 'ఉపాధి' పొందుతున్నామంటున్న పేదలు



పెద్దపల్లి సభకు ట్రాలీ ఆటోలో వస్తున్న గ్రామీణ మహిళలు

పెద్దపల్లిరూరల్: శాసనసభ సాధారణ ఎన్నికల్లో పోటీపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ఏర్పాటు చేసే ఎన్నికల ప్రచారసభ, ఇంటింటిప్రచారం.. ఏదైనా కార్యకర్తలు మాత్రం వాళ్లేనని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. పెద్దపల్లి సెగ్మెంట్‌లో ఇటీవల నిర్వహించిన సభలకు నేతలు మినహా హాజరైన వారిలో అధికశాతం పెయిడ్ కార్యకర్తలే అనడంలో అతిశయోక్తి లేదు.

ఊళ్లలోనే ప్రచారం..

- గ్రామాల్లో స్థానికంగానే ఇంటింటి ప్రచారం నిర్వహించే రాజకీయపార్టీల తరఫున ప్రచారం చేసేందుకు ముందుకొస్తున్న వారు ఏ గుర్తుకు ప్రచారం చేయాలి, ఇలా చేస్తే తమకు ఎంత ఇస్తారని అడిగి మరీ వసూలు చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది.
- అయితే ఆయా ఊళ్లలో ఉండే కొందరు చోటామోటా నాయకులు, గ్రామ పెద్దలు జనసమూహాన్ని తరలించేందుకు కొంతమొత్తాన్ని మాట్లాడుకుని అందులో కొంత నొక్కేస్తున్నారనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి.
- ఇంటింటి ప్రచారాన్ని స్థానికంగా ఉండేవాళ్లతో గంట, గంటన్నర సమయం పాటు నిర్వహిస్తూ రూ.100నుంచి రూ.150 దాకా చెల్లిస్తున్నట్లు సమాచారం. అలాగే మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహించే అగ్రనేతల సభలకు వాహనాల్లో తరలించిన సమయాల్లో రూ.300 నుంచి రూ.500దాకా చెల్లిస్తే సదరు పార్టీ కండువా వేసుకుని సిద్ధంగా ఉంటున్నారని అంటున్నారు.
- కొద్దిసేపటికోసమే కావడంతో మహిళలు, వృద్ధులు సభలకు వచ్చేందుకు పోటీపడుతున్నారు. మగ వారినికి తీసుకొస్తే వారిని తీసుకొచ్చిన నాయకుడు తిరుగు ప్రయాణంలో మందుతో విందు ఏర్పాటు చేయాల్సి వస్తోందని ఎక్కువ మంది నేతలు మహిళలనే పిలిపించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.
- ఇటీవల పెద్దపల్లిలో జరిగిన ఓ సభకు 30వేల మందికిపైగా మహిళలు హాజరుకావడం గమనార్హం.

ఊపందుకోనున్న ప్రచారం..

నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో గుర్తులు పొందిన అభ్యర్థులు ప్రచారంలో మునిగి తేలుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు అగ్రనేతలతో బహిరంగ సభలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని జన సమీకరణలో తలమునకలయ్యారు. దీంతో పెయిడ్ కార్యకర్తలకు డిమాండ్ పెరుగుతోంది.

వరి కోతలు కూడా ఇప్పుడే..

వరి కోతలు ఇప్పుడే రావడం.. ఎన్నికల ప్రచారసభలు జరగనుండడంతో వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడుతోంది. వలసకూలీలతో కొన్ని ప్రాంతాల్లో కోతలు కోస్తుండగా.. యంత్రాలతో ఇంకొన్ని ఏరియాల్లో వరికోతలు ముమ్మరం చేస్తున్నారు. ఏదైతేనేం.. సాధారణ ఎన్నికల ప్రచారపర్వం గడువు చివరి దవలో వస్తుండడంతో జోరు పెంచేందుకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా



మాట్లాడుతున్న రాజేశ్‌సింగ్‌రాణా

జ్యోతినగర్(రామగుండం): ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్ రాణా సూచించారు. ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో రామగుండంలో అతితక్కువ 71శాతం పోలింగ్ నమోదైందని, దీనిని పెంచాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, 12 డీ ప్రకారం ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకునే సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఇందుకోసం మైక్రో అబ్జర్వలను నియమించామన్నారు. పోలింగ్ కేంద్రానికి 100మీటర్ల దూరం వరకు రాజకీయ పార్టీలకు కండువాలు, జెండాలు, సమావేశాలు నిర్వహించరాదని, దుస్తులు ధరించరాదన్నారు. ఏదైనా కారణంతో పోలింగ్‌కు అంతరాయం కలిగితే 30 నిమిషాల్లోపు పోలింగ్ పునః ప్రారంభించాలని ఆదేశించారు. ఈవీఎంల పనితీరు, కమిషనింగ్‌పై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈనెల 30న సాయంత్రం 5 గంటలకు పోలింగ్ కేంద్రాల ద్వారాలు మూసివేయాలని, ఆలోపు క్యూలైన్‌లో ఉన్నవారు ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుర్తింపు పొందిన మీడియా రిపోర్టర్, రాజకీయ పార్టీల ఏజెంట్లకే పోలింగ్ కేంద్రంలోకి అనుమతి ఇవ్వాలని చెప్పారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ, కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, ఏఆర్వోలు కుమారస్వామి, జ్యోతి తదితరులు ఉన్నారు.

కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ మిజమ్మిల్‌ఖాన్

రామగిరి(మంథని): మంథని జేఎన్‌టీయూలో కౌటింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మిజమ్మిల్‌ఖాన్ తెలిపారు. సెంటనరీకాలనీలోని మంథని జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అధికారులతో మాట్లాడుతూ కౌంటింగ్ కోసం కట్టుదిట్టమైన కార్యాచరణ రూపొందించాలన్నారు. పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ డిసెంబరు 3న జేఎన్టీయూలో చేపడతామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా రౌండ్లలో లెక్కింపు చేపడతామని అన్నారు. టేబుళ్ల సంఖ్య, అవసరమైన సిబ్బంది, ఏజెంట్లు, పాసులు, వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల పరిశీలకులు రాజేశ్‌సింగ్ రాణా, శ్రీధర్, పోలీసు పరిశీలకుడు కె.కిశోర్, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్ పాల్గొన్నారు.

నామినేషన్ వేసి.. ప్రచారం మరిచి..

- తెరవెనుకే స్వతంత్రులు
- చోటా పార్టీల అభ్యర్థులదీ అదే పరిస్థితి
- ఖర్చుకు భయపడే ముందుకు సాగని ప్రచారం
- దూకుడు పెంచిన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ



సాక్షి,పెద్దపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం గడువు మరోవారం రోజుల్లో ముగియనుంది. అయినా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో నిలిచిన వారిలో చాలామంది తమ ప్రచారం ఇంకా మొదలుపెట్టని పరిస్థితి నెలకొంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల నాటి నుంచే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల అభ్యర్థులు మండలాల వారీగా ప్రచార సభలు, సమావేశాలతో దూసుకపోతున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల ప్రచార వాహనాలు గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లును ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ స్వతంత్రులుగా, ఇతర చిన్న పార్టీల నుంచి ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో కొంత మంది ప్రచారంలో ఎక్కడా కానరావటం లేదు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య పోరు నెలకొంది.

బరిలో 61 మంది

- పెద్దపల్లి అసెంబ్లీ బరిలో 17మంది అభ్యర్థులు పోటీపడుతుండగా, అందులో ప్రధాన పార్టీలతోపాటు న్యూ ఇండియా, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, భారతీయ స్వదేశీ కాంగ్రెస్ చిన్నపార్టీలతోపాటు, 9మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.
- రామగుండంలో 23మంది బరిలో ఉండగా వీరిలో తెలంగాణ లేబర్, విద్యార్థుల రాజకీయ, జనశంఖారావం, పిరమిడ్, ధర్మసమాజ్, న్యూండియా, భారతీయ స్వదేశ్ కాంగ్రెస్, ఆలిండియా డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీలతో పాటు 11మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీపడుతున్నారు.
- మంథని అసెంబ్లీ బరిలో 21మంది పోటీలో ఉండగా చిన్నపార్టీలను కలుపుకుని 17మంది స్వంత్రులు పోటీచేస్తున్నారు.

సైలెంట్ చేశారా!

ఈవీఎంలో నోటాతో కలుపుకుని 16మంది అభ్యర్థులు దాటితే మరో ఈవీఎం అమర్చాల్సి ఉంటుంది. మూడు నియోజకవర్గాల్లో రెండు ఈవీఎంలూ వాడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో స్వతంత్రులకు పొలయ్యే ఓట్లు ఎవరికి నష్టం చేకూరుస్తాయోనన్న భయం అభ్యర్థులకు ఆందోళన కలిగిస్తోంది. స్వతంత్ర అభ్యర్థులు గెలవకపోయినా, గెలుపోటములను ప్రభావితం చేసిన సందర్భాలు గతంలో అనేకం ఉన్నాయి. దీంతో ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓట్లలో చీలిక రాకుండా స్వతంత్రులు, ఇతర చిన్నపార్టీల అభ్యర్థులను ప్రచారం చేయకుండా తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మరో పక్క.. ఎన్నికల ఖర్చుకు భయపడి ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ప్రచారంలో దూకుడు పెంచడం లేదని తెలుస్తోంది.

గుర్తులతో ఇబ్బందే..

- స్వతంత్రులు ఎన్నికల ప్రచారం చేయకున్నా వారికి పోలైన ఓట్లు ఏ పార్టీ అభ్యర్థికి నష్టం చేకూరుస్తాయనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది.
- ఎందుకుంటే ఇండిపెండెంట్ అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు, ప్రధాన పార్టీల అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను పోలిఉన్న సందర్భంలో క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఉంటుంది.
- దీంతో ఈసారి ఎన్నికల్లో వీరి ప్రభావం ఎంత అనేది ఫలితాలు వస్తే కానీ తెలియని పరిస్థితి నెలకొంది.

క్లుప్తంగా

'రెడ్డి సామాజిక వర్గాన్ని కించపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి'

ధర్మారం: రెడ్డి సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యానించిన కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ధర్మారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతోపాటు మేడారం, పత్తిపాక సింగిల్ విండోల చైర్మన్‌లు ముత్యాల బలరాంరెడ్డి, నోముల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, మాజీ చైర్మన్ కోమటిరెడ్డి మల్లారెడ్డి మాట్లాడారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొందరిపై అనుచిత వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. చట్టసభలకు పోటీ పడుతున్న లక్ష్మణ్‌కుమార్ తన భాష తీరు మార్చుకోవాలని సూచించారు. నాయకులు గాగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సురకంటి శ్రీనివాస్‌రెడ్డి, గాగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు కవిత రోడ్‌షో

పెద్దపల్లిరూరల్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత ఆదివారం పట్టణంలో రోడ్‌షో నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. ఆమె ప్రజలను ఉద్దేశించి జెండా కూడలి వద్ద ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

మంథనిలో..

మంథని: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నియోజకవర్గంలో ప్రచారం చేస్తారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్టేడియంలో నిర్వహించే సభలో మధ్యాహ్నం పాల్గొంటారు. అలాగే రామగిరి మండలం సెంటనరీకాలనీ వాణి స్కూల్ మైదానంలో నిర్వహించే సభలో మాట్లాడనున్నారు. రెండు సభలకు పెద్దసంఖ్యలో జనాన్ని తరలించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నారు. సభలను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు కోరారు.

వాటర్ ఫౌంటెన్‌లో పడి మున్సిపల్ కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైం: ప్రమాదవశాత్తు వాటర్ ఫౌంటెన్‌లో పడి, ఓ మున్సిపల్ కార్మికుడు మృతి చెందాడు. కరీంనగం మండలంలోని నల్లకుంటపల్లికి చెందిన కసిపాక నర్సయ్య(55) మున్సిపాలిటీలోని వాటర్‌వర్క్స్ విభాగంలో పని చేస్తున్నారు. గత కొంతకాలంగా అనార్యోగంతో బాధ పడుతున్నాడు. ప్రస్తుతం కోర్టు చౌరస్తాలో గల వాటర్ ఫౌంటెన్ వద్ద డ్యూటీ చేస్తున్నాడు. శనివారం సాయంత్రం 5 గంటలకు చౌరస్తాలోని లైట్లను ఆఫ్ చేయడానికి వచ్చిన ఓ కార్మికుడికి నీటిలో నర్సయ్య మృతదేహం కనిపించింది. అతను పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మద్యం పట్టివేత

కరీంనగర్ క్రైం: కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ఓ కిరాణంలో శనివారం 36 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. అడిచెర్ల అనంతరాములు కిరాణంలో పోలీసులు తనిఖీ చేపట్టారు. రూ.3,010 విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

తిర్యాణి టు గోదావరిఖని

- 'ఖని'లో గంజాయి ఘాటు
- మందమర్రి మీదుగా రవాణా
- పెరిగిన పోలీసుల నిఘా
- పట్టుబడుతున్నయువత



స్వాధీనం చేసుకున్న గంజాయి



పోలీసులు అదుపులోకి తీసుకున్న 'ఖని'యువకులు

గోదావరిఖని: పారిశ్రామిక క్షేత్రంలో గంజాయి ఘాటు గుప్పుమంటోంది. తక్కువ ధరకు మత్తును ఆస్వాదించేందుకుయువత దానికి బానిస అవుతోంది. చిన్నవయసులోనే మత్తుకు బానిసై చేతిలో డబ్బు లేక కొంతమంది, గంజాయి కోసం మరికొంత మంది యువకులను బానిసలుగా చేసి తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగిస్తున్నారు అక్రమార్కులు. ఈక్రమంలో నేర సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారు. మత్తులో ఏంచేస్తున్నారో తెలియక నేరాలబాట పట్టి జైలు పాలవుతున్నారు. శుక్రవారం గంజాయి తీసుకొస్తూ ఐదుగురు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈఏడాది ఆగస్టు 24న ఆరుకిలోల గంజాయిని వైజాగ్ నుంచి తీసుకొస్తూ టాస్క్‌ఫోర్స్‌కు ఓ యువకుడు పట్టుబడ్డాడు. ఇదే క్రమంలో గతంలో గంజాయితో తయారు చేసిన హాష్‌ఆయిల్ కూడా గోదావరిఖనిలో పట్టుబడింది.

మాఫియాతో..

- కోల్‌బెల్ట్‌లో గంజాయి మాఫియా చాపకింద నీరులా విస్తరిస్తోంది.
- ఇతర రాష్ట్రాల నుంచి ద్విచక్రవాహనాలు, రైళ్లు, బస్సుల ద్వారా సరిహద్దులు దాటి జిల్లాలోకి చేరుతోంది.
- తక్కువ ధరలో ఎక్కువ మత్తునిచ్చే గంజాయికి విద్యార్థులు, యువత బానిసల్లా మారుతున్నారు.
- గంజాయి తాగేందుకు కొన్ని ప్రాంతాలు అడ్డాలుగా మారాయి.
- సూళ్లు, మైదానాలు, నిర్మానుష్య ప్రాంతాలను యువత ఎంచుకుంటోంది.
- ధూల్‌పేట్ లాంటి ముద్దు పేర్లతో గుడుంబా, గంజాయి విక్రయాలు, తాగడానికి అడ్డాలుగా మారుతున్నాయి.
- అర్ధరాత్రి స్పోర్ట్స్ బైక్‌లతో మత్తులో ఊగుతూ ప్రమాదాల బారినపడటం సర్వసాధారణంగా మారుతోంది.
- పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినా.. క్రయ,విక్రయాలు, వినియోగం తగ్గకపోగా మరింత పెరుగుతోంది.
- ఇప్పటికే సీలేరు, మహారాష్ట్ర నుంచి ఎక్కువగా గంజాయి దిగుమతి అవుతుండగా, ఇటీవల ఓ యువకుడు వైజాగ్ నుంచి గంజాయి తీసుకువస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు 6.4కిలోలతో పట్టుబడ్డాడు.
- పదికిలోల గంజాయితో సమానంగా ఉండే లీటర్ హాష్‌ఆయిల్ రూ.10లక్షలకు పైగా ధరతో విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది.

కాగజ్‌నగర్ టూ గోదావరిఖని

కాగజ్‌నగర్ నుంచి గోదావరిఖనికి రవాణా అవుతున్న 4కిలోల గంజాయిని గురువారం రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

- విశ్వసనీయ సమాచారం మేరకు గోదావరి బ్రిడ్జి ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేసి రెండుబైక్‌లపై వచ్చిన ఐదుగురు యువకులను ఆపి తనిఖీ చేయగా బ్యాగ్‌లలో 4.060 కేజీ డ్రైగంజాయి దొరికింది.
- దీని విలువ సుమారు రూ.80వేలు ఉంటుంది.
- గాజుల సిద్దార్థ, దాసరి వినోద్, ఇర్ఫాన్, సతికం శ్రీరామ్‌వర్మ, అజరుద్దీన్‌గా పేర్కొన్నారు. వ్యసనాలకు బానిసై గంజాయి తాగడంతోపాటు విక్రయాల కోసం ఈదారి ఎంచుకున్నారు.
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదగించాలనే దురుదేశంతో ఆసిఫాబాద్ జిల్లా తీర్యాణి నుంచి గుర్తుతెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి గోదావరిఖని ప్రాంతంలోని అమాయకపు స్టూడెంట్స్, యువతకి ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- నిందితుల వద్ద లభించిన గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీసులు పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నారు.

అంతా యువకులే..

రెండు బైక్‌లపై గంజాయి రవాణాలో పట్టుబడిన వారిలో ఐదుగురు యువకులే. వారిలో ఒకరు మందమర్రికి చెందిన వ్యక్తికాగా, మిగిలిన నలుగురు గోదావరిఖనికి చెందిన వారుగా పోలీసులు తెలిపారు. ఆసిఫాబాద్, తిర్యాణి నుంచి బైక్‌లపై వచ్చి ముందుగా మందమర్రిలో డంప్‌చేయాలని నిర్ణయించారు. అయితే సమయం లేకపోవడంతో నేరుగా గోదావరిఖనికి తరలించాలని బైక్‌లపై వస్తుండగా పోలీసులకు గోదావరిబ్రిడ్జి సమీపంలో పట్టుబడ్డారు. వీరిలో గోదావరిఖని ఉదయ్‌నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి గాజుల సిద్దార్థ(20), పరుశరాంనగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఎండీ ఇర్ఫాన్‌పర్వేజ్(21), మందమర్రికి మార్కెట్‌ప్రాంతానికి చెందిన ఐటీఐ విద్యార్థి దాసరి వినోద్(21), ఉదయ్‌నగర్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి సతికం శ్రీరాంవర్మ(21), స్థానిక మార్కండేయకాలనీకి చెందిన డిగ్రీ విద్యార్థి ఎండీ అజారుద్దీన్(20)ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

హోరాహోరీగా సీఎస్‌ఏ క్రీడాపోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: 18వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీఎస్‌ఏ క్రీడా పోటీలు కరీంనగర్‌లోని సెయింట్ జాన్ పాఠశాలలో రెండు రోజులుగా హోరాహోరీగా సాగుతున్నాయి. శనివారం పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఇన్నాలు, సెయింట్ జాన్స్ పాఠశాలల రాష్ట్ర అధ్యక్షురాలు జబమాల, రాష్ట్ర కన్వీనర్ సిస్టర్ మార్గరెట్‌లు క్రీడాకారులను పరిచయం చేసుకొని, ప్రారంభించారు. క్రీడలతో స్నేహ సంబంధాలు, శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతాయన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీల్లో విజయం సాధించాలని పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించారు. దీంతో లీగ్ దశ స్థాయి క్రీడలు ముగిశాయి. మూడోరోజు ఆదివారం సెమీఫైనల్స్, ఫైనల్స్, మూడు, నాలుగు స్థానాల కోసం పోటీలు చేపడుతామన్నారు. అలాగే, మధ్యాహ్నం 3 గంటలకు పోటీల ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీకి సన్మానం

సీఎస్‌ఏ క్రీడల నిర్వహణలో భాగంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వై.ప్రేమ్‌రెడ్డిని పీఈటీలు సన్మానించారు. 30 ఏళ్లుగా ఆయన అనేక మందిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారని తెలిపారు. ప్రేమ్‌రెడ్డి త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా సత్కరించినట్లు పేర్కొన్నారు.

బొగ్గు గనుల తనిఖీ



గనిలోకి వెళ్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ పరిధిలోని జీడీకే-2, 2ఏ గనులను ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ శనివారం తనిఖీచేశారు. గనిలోని ఎస్‌ఎస్ 13/2 ప్యానెల్ 2వ సీమ్‌లోని పని స్థలాలను పరిశీలించారు. కార్మికులకు ప్యానల్‌కు సంబంధించిన సూచనలు ఇవ్వడంతోపాటు, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ జీఎం డి.రామస్వామి, గని మేనేజర్ జె.తిరుపతి, సెక్షన్ ఇన్‌చార్జి తాటిపాముల శంకర్, సల్మాన్, తిరుపతి, జూనియర్ సర్వే ఆఫీసర్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే టోర్నీలో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మంథని: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన జపాన్ షటోరియో కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరాటే శిక్షకులు, కాయి రాష్ట్ర స్పోర్ట్స్ కమిషన్ కావేటి సమ్మయ్య తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగాల్లో పలువురు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఇందులో ఎండీ తైభ, ఎండీ ఈశ్రఆర్ విశాలి, వైష్ణవి, అశ్విని‌బాబు,, అక్షయ, కీర్తన ఉన్నారు.

పుట్టలో పాలుపోసి వచ్చాక..

- పాముకాటుతో మహిళ మృతి



భారతి(ఫైల్)

మంథని: నాగుల పంచమి సందర్భంగా పుట్టలో పాలుపోసిన ఓ మహిళ.. తన కుటుంబసభ్యులను సల్లంగా చూడాలని వేడుకుంది. నాగదేవతకు పూజలుచేసింది. ఆ రాత్రే ఆమె అనూహ్యంగా పాముకాటుకు గురై ప్రాణాలు విడిచింది. పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన బొద్దెల భారతి(40) శుక్రవారం రాత్రి పాముకాటుతో మృతి చెందింది. ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో కింద వేసుకున్న దుప్పట్లలో దూరిన పాము భారతినికాటు వేసింది. ఏదో కుట్టినట్లుగా ఉండడంతో నిద్రలేచేసరికి పాము కనిపించిందని, శరరంపై గాట్లు కూడా ఉండడంతో వెంటనే స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు.. గోదావరిఖనికి తరలించగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు,. కాగా నాగులపంచమి సందర్భంగా పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించిన సదరు మహిళ.. పాము కాటుకు గురికావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

గుండెపోటుతో బీటెక్ విద్యార్థి మృతి



సల్మాన్(ఫైల్)

కమాన్‌పూర్(మంథని): రొంపికుంట గ్రామానికి చెందిన సల్మాన్(20)అనే బీటెక్ విద్యార్థి శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. హైదరబాద్‌లో బీటెక్ చదువుతున్న సల్మాన్.. ఇటీవల ఇంటికి వచ్చాడు. శుక్రవారం రాత్రి చాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు పెద్దపల్లిలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా సల్మాన్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.

మీకు తెలుసా?

మొదటిసారి ఓటుహక్కు

సాక్షి, పెద్దపల్లి: ఓటు ప్రజాస్వామ్యానికి పునాది. ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుంది. అయితే 1907లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వేసిన 'రాయల్ కమిషన్' సిఫారసుల ఆధారంగా '1909-కౌన్సి ల్ చట్టం' పరిమిత సంఖ్యలో భారతీయులకు తొలిసారిగా ఓటుహక్కు కల్పించింది. 1935-భారత ప్రభుత్వ చట్టం మరింత మందికి ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. రాజ్యాంగ పరిషత్ ఎన్నికల్లో దాన్ని మరింత విస్తృతం చేసి 1950 నుంచి సార్వత్రిక ఓటు హక్కు అమల్లోకి వచ్చింది. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష భేదం లేకుండా దేశంలో నివసించే 21సంవత్సరాలు నిండిన పౌరులు అందరికీ ఆర్టికల్ 326 ద్వారా ఓటుహక్కు కల్పించింది. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఓటుహక్కును 21ఏళ్ల నుంచి 18ఏళ్లకు తగ్గించింది.

ఓటుహక్కు వజ్రాయుధం



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): ఓటుహక్కు వజ్రాయుధంలాటిదని, ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), రామగుండం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ అన్నారు. శనివారం గోదావరిఖని గాంధీచౌక్ చౌరస్తాలో డీఆర్‌డీఏ, మెప్మా, రామగుండం నగరపాలక సంస్థ తదితర శాఖల ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అరుణశ్రీ మాట్లాడుతూ, ఓటుహక్కును సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. పోలింగ్ శాతం పెంచడానికి స్వీప్ ఆధ్వర్యంలో విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత ఓటింగ్ శాతం పెంచడంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు వెల్లడించారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు ప్రభావితం కాకుండా, ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈనెల 30న తమ నియోజకవర్గంలో అందుబాటులో ఉండి ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం స్థానిక లక్ష్మీనగర్ చౌరస్తా, వ్యాపారస్తుల కూడళ్లు, పరిసర ప్రాంతాల్లో అదపు కలెక్టర్ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాజాత నిర్వహించిన ఆట, పాట గేయ, సాంస్కృతిక, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రవూఫ్‌ఖాన్, స్వీప్ నోడల్ అధికారి స్వరూపరాణి, మెప్మా అర్బన్ పీడీ రజనితోపాటు సీనియర్ సిటిజన్స్, ట్రాంజెండర్స్, మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలుగడ్డ కూర.. అన్నం.. జీలేబీ

- నియోజకవర్గ కేంద్రంలోనే ఒకసారి విందు
- కుల, గ్రామపెద్దలే హాజరు
- నాటి ప్రచారం తీరిది



జంగ్ తెలంగాణ

మంథని: మంథని అంటేనే మంచి వంటకాలకు పెట్టింది పేరు. ఇక్కడి వంటలకు మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో కూడా ఓ ప్రత్యేక ఉంది. వెనకటి ఎన్నికల్లో నాయకులు ప్రచారానికి వచ్చినప్పుడు కేవలం పది మందిని కలిసి వారి సుమాయు విందు భోజనాలు ఏర్పాటు చేసేవారు. ఈ విందులో ఆలుగడ్డ కూరతో కూడిన అన్నం, జీలేబీనే వడ్డించేవారు. ఎన్నికలొస్తే ఇప్పటికీ ఈ భోజనమే గుర్తుస్తుందని అప్పటి ఓటర్లు చెబుతుంటారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి పోలింగ్ వరకూ అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకోవడం కోసం అనేక విధానాలు అవలంబిస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు రోజూ విందు భోజనాలు ఏర్పాటు చేయడమే కాకుండా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బు, మద్యం, ఇతరత్రా వస్తువులను ముట్టజెబుతున్నారు. 1972లో దివంగత ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు కాంగ్రెస్ పార్టీ నుంచి మంథని అసెంబ్లీకి పోటీ చేశారు. ఈయనకు పోటీగా అప్పటి తెలంగాణ ప్రజాసమితి ఈవీ పద్మనాభం బరిలో నిలిచారు. ఈవీ పద్మనాభం మంథనిలోని తమ్మిచెరువుకట్ట వద్ద సమావేశం నిర్వహించగా, ఆయా గ్రామాల నుంచి కులపెద్దలు, వీధిలోని పెద్దమనుషులు హాజరయ్యారు. అలాగే పీవీ నర్సింహారావు తరపున అప్పటి కాంగ్రెస్ నాయకుడు కొంగల జగ్గయ్య, పీవీ సోదరుడు రంగారావు ఓసారి మంథనికి వచ్చి కొంతమంది పెద్దలను కలిసి వెళ్లేనే విజయాన్ని సాధించారు. ఇలా అప్పటి ప్రచారం, ఖర్చు ఉండేది. కానీ ప్రస్తుతం ఒక్కో అభ్యర్థి రూ.కోట్లు ఖర్చు పెడుతున్న తీరు అప్పటి తరం ఓటర్లను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పార్టీ ప్రముఖులతో ప్రచారాలు, గ్రామగ్రామాన సమావేశాలు, ప్రచారాల హోరు, ఓటర్లను ఆకర్షించలేకపోతోంది. విలక్షణమైన తీర్పు ఇచ్చే ఇక్కడి ఓటర్లు ఇంకా అభ్యర్థుల ప్రలోభాలకు తలొగ్గే పరిస్థితులు లేవు. కానీ నాటి ప్రచార తీరు నేటి ఎన్నికల పరిస్థితులను చూస్తూ నాటి ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు.

అన్నింటా అంగన్‌వాడీలే..

- సంక్షేమ పథకాల అమలులో వీరే కీలకం
- ప్రతీపనిలో వారి భాగస్వామ్యం తప్పనిసరి
- జిల్లాలో 706 మంది, రామగుండం నియోజకవర్గంలో 205 మంది



ఓటర్లకు అందజేస్తున్న పోల్‌చిట్టీలు



ఓటుఅవగాహన సదస్సులో అంగన్‌వాడీలు

రామగుండం: ప్రభుత్వం చేపట్టే ప్రతీ సంక్షేమ పథకం, ఇతర కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి విజయవంతం చేసేది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలే. లబ్ధిదారుల ఎంపిక నుంచి వారి అభిప్రాయాలు, అభిరుచులు తదితర సమగ్ర సమాచారం సేకరించడంలో అంగన్‌వాడీ ఉద్యోగులే కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇలాంటి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు జిల్లాలో 706మంది, రామగుండం నియోజకవర్గంలో 205 మంది ఉన్నారు.

గర్భిణుల నుంచి చిన్నారుల వరకు..

- అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సమగ్ర వివరాలను కార్యకర్తలు నమోదు చేసుచేస్తున్నారు.
- దీనిఆధారంగా గర్భిణుల ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆశ వర్కర్ సాయంతో ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వివిధ పరీక్షలు చేస్తున్నారు.
- ప్రసవం తర్వాత కొంతకాలం వరకు బాలింత ఆరోగ్య సంరక్షణతోపాటు పుట్టిన బిడ్డ ఆరోగ్య పరిస్థితి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు.
- చిన్నారులకు మూడేళ్ల వయసు వచ్చే వరకు తమ కేంద్రాల్లో ఆటాపాటలతో విద్యాబోధన చేస్తున్నారు.
- సకాలంలో పౌష్టికాహారం అందిస్తున్నారు.

టీకాల బాధ్యత వారిదే..

గర్భిణులు, బాలింతలకు నిర్దేశిత గడువులోగా టీకా వేయించేందుకు ఆశ వర్కర్ల సేవలు వినియోగిస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. కుటుంబసభ్యుల కన్నా వీరిపైనే అధిక బాధ్యత ఉంటోంది. కంటి వీరిపైనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రసవించిన తర్వాత పసిపిల్లల ఆరోగ్య పరిరక్షణ, వయసు, ఎత్తుకు తగిన బరువు తదితర అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు.

ఓటరు జాబితా తయారీలో..

18 ఏళ్ల వయసు నిండిన యువతీయువకులకు ఓటుహక్కు కల్పించేందుకు ఏటా సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓటర్ల చిరునామా మార్పు, మృతిచెందిన ఓటర్ల తొలగింపు, నూతన ఓటర్ల నమోదు, స్థానికంగా లేని వారి పేర్లు జాబితా నుంచి తొలగించడం తదితర పనులు చేపట్టేది వీరే. క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారాన్ని ఎన్నికల కమిషన్‌కు అందజేస్తారు. ఈ నివేదిక ఆధారంగానే కొత్త ఓటరు జాబితా సిద్ధం చేస్తారు.

నిరక్షరాస్యుల గుర్తింపు..

ఇటుక బట్టీల్లో పనిచేసే నిరక్షరాస్యులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడం. బాల్య వివాహాలను అడ్డుకొని పెళ్లీడు వచ్చాకే వివాహం చేయాలనే అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం అంగన్‌వాడీ ఉద్యోగుల ప్రధాన కర్తవ్యం. ఇద్దరు సంతానం తర్వాత దంపతులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంతో వైద్య శిబిరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంలోనూ వీరే కీలంగా వ్యవహరిస్తున్నారు.

సామాజిక అంశాలపై సర్వే..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పథకాల అమలుకు ముందు క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీలతో కుటుంబ సర్వే, కేటాయింపుల నిమిత్తం తదితర అంశాలపై సర్వే చేయించడం జరుగుతుంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే, కంటి వెలుగు, మూడేళ్లలోపు చిన్నారుల వివరాలు, సాధారణ వ్యాధులైన డయాబెటిస్, బీపీ తదితర ఆరోగ్య వివరాలను సైతం సేకరిస్తున్నారు.

ఎన్నికల విధుల్లో కీలకం..

18 ఏళ్ల వయసు నిండినవారికి ఓటుహక్కు కల్పించడంతోపాటు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌ఓ)గా ఓటరు జాబితా సవరణ శిబిరాల ఏర్పాటు, ఓటర్లను చైతన్యపరిచేందుకు మెప్మా, ఐకేపీ సీవోలు, ఆశ వర్కర్లతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, పోలింగ్ చిట్టీల పంపిణీ, ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు నేరుగా కరపత్రాలు అందజేయడం తదితర విధుల్లోనూ భాగస్వామ్యం అవుతున్నారు.